క్లుప్తంగా

తాగునీటి వృథాను అరికట్టాలి



పాన్‌గల్‌: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ సమీపంలో గ్రామ పంచాయతీకి సంబంధించిన తాగునీటి బోర్‌ పైపు లీకేజీతో నీరు వృథాగా పోతుంది. బోరు పరిసరాల్లో నీరు నిలిచి ఈగలు, దోమలు వృద్ధి చెందడంతో పాటు దుర్వాసన వెదజల్లుతుందని సమీప కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి బోరు పైపులైన్‌ లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి నరేష్‌ను వివరణ కోరగా.. బోరు పైపులైన్‌ లీకేజీ అవుతుంది నిజమేనని, జీపీలో నిధుల కొరత కారణంగా మరమ్మతులకు ఇబ్బందిగా మారిందన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పాన్‌గల్‌: మండలంలోని మంగళ్లపల్లి మాజీ సర్పంచ్‌ అంజి మాతృమూర్తి శాంతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌ మండల నాయకులు ఆదివారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవికుమార్‌, రాముయాదవ్‌, బ్రహ్మయ్య, రాంచందర్‌, జూపల్లి యువసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బాల సంస్కారాల వార్షికోత్సవం



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని కుమ్మరిగేరి ఆంజనేయస్వామి ఆలయం వద్ద విశ్వహిందూ పరిషత్‌ ఆధ్వర్యంలో బాల సంస్కారాల వార్షికోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పల్లాటి నాగయ్య కేంద్రాన్ని సందర్శించి సమీక్ష జరిపారు. అనంతరం పలు సూచనలు చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయులు ఆగారం జ్యోతిని సంస్కార శిక్షణ విభాగ్‌ మండల ప్రముఖ్‌గా, తిరుపతయ్యను సహాయ ప్రముఖ్‌గా ప్రకటించారు. వారితో ఓంకారం చేయించారు. కార్యక్రమంలో నారాయణ, శ్రీను, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్‌ సిస్టం వితరణ



ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి పహాడీ షరీఫ్‌ ఎస్‌ఐ వట్టెం లక్ష్మయ్య స్కూల్‌కు సౌండ్‌ సిస్టం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం చెన్నప్ప అడిగిన వెంటనే స్పందించిన అప్పారెడ్డిపల్లికి చెందిన షరీఫ్‌ రూ.30 వేల విలువ చేసే సౌండ్‌సిస్టంను ఆదివారం హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు ఆనంద్‌, గ్రామస్తులు చాంద్‌పాషాకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం తదితరులు లక్ష్మయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేట్‌ స్కూళ్లల్లో 25 శాతం సీట్లు కేటాయించాలి



కొల్లాపూర్‌: ప్రైవేట్‌ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లి కురుమయ్య, జిల్లా ఈసీ మెంబర్‌ బంకల దాసు కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు పాఠశాలలో పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లు ఇవ్వాలన్నారు. ఈ నిబంధనను ఏ పాఠశాల పాటించడం లేదని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు దీన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇప్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు విష్ణు, అంజి, మధు, లక్ష్మణ్‌, నాగిశేషి తదితరులున్నారు.

బీటీ పనులకు మోక్షం



మొర్రం పోసి ఫ్మార్మేషన్‌ చేసిన అప్పారెడ్డిపల్లి నుంచి నేలబండతండా రోడ్డు

- అప్పారెడ్డిపల్లి, నేలబండతండాల మధ్య రాకపోకలకు తీరనున్న కష్టాలు
- 2.3 కిలో మీటర్ల నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరు
- పూర్తయిన ఫార్మేషన్‌ పనులు

ఖిల్లాఘనపురం: ఏళ్లుగా రోడ్డు సౌకర్యం సక్రమంగా లేక అవస్థలు పడుతున్న అప్పారెడ్డిపల్లి, నేలబండతండా, దేవబండతండా ప్రజల కష్టాలు తీరనున్నాయి. అప్పారెడ్డిపల్లి నుంచి రెండు గిరిజన తండాలను కలుపుతూ ఖిల్లాఘనపురం మండల శివారు వరకు ఉన్న 3 కిలోమీటర్ల మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండర్‌ తీసుకున్న కాంట్రాక్టర్‌ రోడ్డు పనులు ప్రారంభించారు.

మద్దిగట్ల వరకు..

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి నేలబండతండా మీదుగా మద్దిగట్ల శివారు వరకు మద్దిగట్ల రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో అప్పారెడ్డిపల్లి గ్రామ ప్రజలతో పాటుగా దేవబండతండా, నేలబండతండాల ప్రజలకే కాకుండా భూత్‌పూర్‌ మండలంలోని మద్దిగట్ల గ్రామానికి చెందిన ప్రజలకు మేలు జరగనుంది. ఈ దారిలో ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా గుంతలుగా మారడంతో చిన్న పాటి వర్షం కురిసినా వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఒక్కో సమయంలో మోటర్‌ సైకిళ్ల రాకపోకలకు సైతం ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పంట పొలాలకు ఎరువులు, ఇతర సామగ్రి తీసుకుపోవాలంటే రైతులకు నరకం కనపడుతుంది. మట్టి రోడ్డును కాస్త బీటీ రోడ్డుగా మార్చనుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రోడ్డు వెంట ఉన్న కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలిగించి ఫార్మేషన్‌ పూర్తి చేశారు.

ట్రైబల్‌ వెల్ఫేర్‌ నిధుల నుంచి..

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి దేవబండతండా, నేలబండతండాల మీదుగా మద్దిగట్ల శివారు వరకు బీటీ రోడ్డు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్‌ వెల్ఫేర్‌ ఫండ్‌ రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి.

రైతులకు ఉపయోగంగా..

అప్పారెడ్డిపల్లి నుంచి మద్దిగట్ల రోడ్డు 3 కిలో మీటర్లు డాంబర్‌ రోడ్డు వేస్తరని తెలిసింది. ఇటీవల మొర్రం పోసి సాపు చేసింద్రు. మాకు చాలా సంతోషంగా ఉంది. దారి వెంట గుంతలు ఏర్పడటంతో పొలాలకు వెళ్లే సమయంలో మేము చాలా ఇబ్బందులు పడేవాళ్లం. డాంబర్‌ రోడ్డు వేస్తే ఇబ్బందులు తీరుతాయి.

– బంగి నర్సింహ, అప్పారెడ్డిపల్లి

ఫార్మేషన్‌ పనులు పూర్తి

అప్పారెడ్డిపల్లి నుంచి మద్దగట్లకు వెళ్లే రోడ్డును బీటీగా మార్చేందుకు ఏర్పాట్లు చేశాం. నేలబండతండా వరకు ఫార్మేషన్‌ రోడ్డు పనులు పూర్తయ్యాయి. త్వరలోనే మెటల్‌ వేయిస్తాం. వీలైనంత తొందరలో బీటీ పనులు పూర్తి చేయిస్తాం.

– శరత్‌చంద్ర, ఏఈ, ట్రైబల్‌ వెల్ఫేర్‌

‘బీజేపీ వారసత్వ, మతతత్వ పార్టీ కాదు’



మొక్కలు నాటుతున్న లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తి రూరల్‌: బీజేపీ ఎప్పటికీ వారసత్వ, మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకమని జెడ్పీ మాజీ చైర్మన్‌ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో 11 ఏళ్ల అధికారం పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ మండల, పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలో పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అహ్మదాబాద్‌ విమాన ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని నిమిషం పాటు మౌనం పాటించారు. మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రపంచమే గర్వించదగ్గ పాలన సాగిస్తూ పార్టీ బలోపేతం కోసం కృషి చేశాడన్నారు.. మేకిన్‌ ఇండియా ద్వారా భారత్‌ ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. అనంతరం పట్టణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గౌని వేమారెడ్డి, మెంటేపల్లి పురుషోత్తంరెడ్డి, అయ్యంగారి ప్రభాకర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్‌, విష్ణువర్ధన్‌రెడ్డి, కంచ ఆంజనేయులు, రంగస్వామిగౌడ్‌, నరసింహానాయుడు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌ అవార్డు గ్రహీత వెంకటేశ్వర్‌రావుకు సన్మానం



మద్దాలి వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి టౌన్‌: జిల్లా వాసి మద్దాలి వెంకటేశ్వరరావు నిర్మించిన చదువుకోవాలి అనే సినిమాకు రాష్ట్ర ప్రభుత్వం గద్దర్‌ అవార్డును ప్రదానం చేసింది. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్‌ కళాశాల ఎదురుగా గద్దర్‌ అవార్డు గ్రహీత మద్దాలి వెంకటేశ్వరరావును ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామానికి చెందిన మద్దాలి వెంకటేశ్వరరావు గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వ్యాప్తి కోసం సినిమా నిర్మించి, ప్రతిష్టాత్మకమైన గద్దర్‌ అవార్డును శనివారం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. జిల్లా వాసికి తొలిసారి ఈ అవార్డు రావడం ఆనందకరమన్నారు. సినీ రంగంలో వనపర్తి పేరు గద్దర్‌ అవార్డుతో మరింత పెరిగిందన్నారు. అదేవిధంగా పాత్రికేయుల సంఘం జిల్లా అధ్యక్షుడు బక్షి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో, అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో సైతం గద్దర్‌ అవార్డు గ్రహీత మద్దాలి వెంకటేశ్వరరావును శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు నందిమల్ల యాదయ్య, కిరణ్‌కుమార్‌, అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

29న సాయిచంద్‌ విగ్రహావిష్కరణ



స్థలం పరిశీలిస్తున్న రజనీసాయిచంద్‌

అమరచింత: పట్టణానికి చెందిన దివంగత సాయిచంద్‌ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశామని ఆయన సతీమణి గిడ్డంగుల కార్పొరేషన్‌ మాజీ చైర్‌పర్సన్‌ రజనీసాయిచంద్‌ తెలిపారు. ఆదివారం అమరచింతకు వచ్చిన ఆమె బీఆర్‌ఎస్‌ నాయకులతో కలిసి సాయిచంద్‌ విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించారు. ఈమేరకు ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో తన గానంతో యావత్తు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న సాయిచంద్‌ ఆకస్మిక మృతి తీరని లోటన్నారు. సాయి ఆశయ సాధనలో ముందుకు వెళ్తున్నామన్నారు. 29న నిర్వహించే సాయిచంద్‌ విగ్రహావిష్కరణకు బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌, మాజీ మంత్రి హరీష్‌రావు వస్తున్నారని వెల్లడించారు. అనంతరం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ పట్టణ ఉపాధ్యక్షుడు బాలరాజ్‌ కుమారుడు సంపత్‌ జేఈఈలో 412 ర్యాంక్‌ సాధించడంతో సత్కరించారు. కార్యక్రమంలో రమేష్‌ ముదిరాజ్‌, నరసింహులుగౌడ్‌, నాగభూషణం గౌడ్‌, లెనిన్‌, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

సగరుల అభ్యున్నతికి కృషి

మదనాపురం: సగరుల అభ్యున్నతికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘం మండల అధ్యక్షుడు వేముల వెంకటన్న అన్నారు. సంఘం సీనియర్‌ నాయకుల సమక్షంలో ఆదివారం మండల కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా వేముల వెంకటన్న, ఉపాధ్యక్షుడిగా శంకర్‌, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా కిరణ్‌, కార్యదర్శులుగా వేముల సత్యం, రావుల కొండన్న, ప్రచార కార్యదర్శులుగా శ్రీనివాసులు, వేముల నరేష్‌, కార్యవర్గ సభ్యులు రాములు, కృష్ణసాగర్‌, ప్రభాకర్‌తో పాటు మరికొందరిని నియమించారు. కార్యక్రమంలో చీకటి సత్యం, చీర పెద్దనాగులు, పోతుకపల్లి ఆంజనేయులు, చెన్నరాయుడు, సుగురు మురళి, పోత్కపల్లి కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు వెంటనే అమలుచేయాలి



మాట్లాడుతున్న రాజన్న

అమరచింత: కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని మాస్‌లైన్‌ మండల పార్టీ కార్యదర్శి రాజన్న, పట్టణ కార్యదర్శి మస్లమణి డిమాండ్‌ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గద్దెనెక్కి 18 నెలలు దాటినా ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. జూన్‌ 2 నుంచి ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌ యువవికాశం రుణాలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు కనీసం ఒక్కరికి కూడా ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల పేర్లను కూడా బయటపెట్టడం లేదన్నారు. మహిళలకు ప్రతి నెల రూ.2,500, ఆడపిల్లలకు స్కూటీలు, పెన్షన్ల అమలు చేయకుండా కాలం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో జూనియర్‌ కాలేజీ ఏర్పాటు చేస్తామన్న హామీని సైతం ఇప్పటి వరకు పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాస్‌లైన్‌ డివిజన్‌ నాయకులు రాజు, ఆనంద్‌, విజయ్‌ కుమార్‌ పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

దేవరకద్ర: కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం పిలుపునిచ్చారు. ఆదివారం దేవరకద్ర మార్కెట్‌ యార్డు ఆవరణలో నిర్వహించిన టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం వాటిని సవరించి నాలుగు కోడ్‌లుగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా రూపొందించిందని ఆరోపించారు. కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌ సోర్సింగ్‌, చిన్న ఉద్యోగులకు ఉన్న చట్టాలు, హక్కులు రద్దయి బానిసలుగా మార్చబోతున్నదని విమర్శించారు. కేంద్రం కార్మికులపై అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను దేశవ్యాప్త సమ్మె, పోరాటాలతో ఉద్యమించాలని కోరారు.

మహాసభల పతాకావిష్కరణ

దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభల సందర్భంగా వందలాది మంది కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. మార్కెట్‌ ఆవరణ వరకు ర్యాలీ కొనసాగించి కార్మికుల చిహ్నమైన సుత్తి, కొడవలి, ఎర్రజెండాను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు దేవదానం, సీపీఐ ఎంఎల్‌ మాస్‌లైన్‌ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌ రాంచందర్‌, అనుబంధ సంఘాల నాయకులు కొండారెడ్డి, వెంకటేశ్‌, అరుణ్‌కుమార్‌, వెంకటన్న, గణేశ్‌, అరుణక్క, వెంకట్రాములు, దాసు, బాలు, కొండన్న, పుట్టరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలి

మానవపాడు: ప్రభుత్వాలు మారుతున్నా రోడ్డు పరిస్థితి మారడం లేదు. ఎన్నికల రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు హామీలు నీటిపై బుడగల మాటలకే పరిమితమవుతున్నాయని ఆగ్రహించిన ప్రజలు నడిరోడ్డుపై ఆదివారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు చెన్నిపాడు గ్రామస్తులు. మానవపాడు మండలంలోని చెన్నిపాడు నుంచి మానవపాడు మండ కేంద్రానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా నిత్యం ప్రమాదాలకు గురువుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. మోకాటి లోతు గుంతల్లో ప్రమాదాల బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నోమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని కోరారు.

మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



మైసమ్మ దేవతకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. మృగశిర కార్తి రెండో ఆదివారం రైతులు, వ్యవసాయ కూలీలు అమ్మవారిని దర్శించుకొని వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు పెద్దఎత్తున సొంత వాహనాలల్లో తరలివచ్చారు. భక్తుల రద్దీ పెరగడంతో మండల కేంద్రంలో ట్రాఫిక్‌ సమస్య ఏర్పడి గంటపాటు రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ సతీష్‌ సిబ్బందితో వచ్చి రోడ్డుపై ఉన్న వాహనాలను క్రమబద్ధీకరించి ట్రాఫిక్‌ క్లీయర్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైసమ్మ జాతరకు వెళ్లే భక్తులు ముష్టిపల్లి, మరికల్‌, పెద్దకారుపాముల మీదుగా నాగర్‌కర్నూల్‌ దారిలో వచ్చే భక్తుల వాహనాలు అటువైపు నుంచి వెళ్లాలని సూచించారు. కొల్లాపూర్‌ ప్రాంతం నుంచి వచ్చే భక్తులు సాతాపూర్‌, యాపట్ల, చిన్నకొత్తపల్లి గ్రామాల మీదుగా మైసమ్మ జాతరకు వెళ్లితే మండల కేంద్రంలో ట్రాఫిక్‌ సమస్య ఉండదని తెలిపారు. ప్రతి ఆదివారం మండల కేంద్రంలో కోళ్లు, టెంకాయలు, పూజ వస్తువులు అమ్ముకునే వారు రోడ్డుపై ఉండకుండా షాపుల ముందు ఉండి అమ్ముకోవాలని సూచించారు. మైసమ్మ జాతరకు 25 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఎండోమెంట్‌ అధికారి రామేశ్వరశర్మ తెలిపారు. భక్తులు టికెట్లు, హుండీ ద్వారా రూ.3లక్షల అదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

శిథిలావస్థలో పాఠశాల భవనాలు

- చెట్ల కింద చదువులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు



కల్వకోలు ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థకు చేరిన గదులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో గదులు శిథిలావస్థకు చేరుకొని తరగతి గదులు లేక చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారు. మండలంలో శిథిలావస్థకు చేరిన పాఠశాలల్లో బాచారం, పెద్దకొత్తపల్లి, దేవునితిర్మలాపూర్‌, కల్వకోలు, యాపట్ల, ముష్టిపల్లి, మరికల్‌, నక్కపల్లి తదితర గ్రామాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో తరగతి గదులన్నీ శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడుతున్నాయి. వర్షమొస్తే వర్షపు నీరంతా పాఠశాలల గదుల్లో చేరుతోంది. దీంతో తరగతులు నిర్వహించేందుకు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వలకోలు పాఠశాలల్లో గదుల్లేక చెట్ల కిందనే మూడు తరగతులను నిర్వహిస్తున్నారు. ముష్టిపల్లి ఉన్నత పాఠశాలలో గదుల్లేక మహిళా సమాఖ్య భవనం, గ్రామ పంచాయతీ భవనం చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్నారు. మండలంలో 41 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వాటిలో 3009 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 9 ఉన్నత పాఠశాలలున్నాయి. వాటిలో 2800 మంది విద్యార్థులు చదువుతున్నారు. కేజీబీవీలో 246 మంది, బీసీ గురుకుల పాఠశాలల్లో 610 మంది విద్యార్థులు చదువుతున్నారు. మన ఊరు–మన బడి పథకం కింద పాఠశాలలకు మంజూరైన తరగతి గదులను కాంట్రాక్టర్లు అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. ఆ గదుల నిర్మాణం పూర్తి చేస్తే విద్యార్థులకు ఇబ్బందులు తొలుగుతాయి. పాఠశాలల్లో అదనపు గదులకు నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.

ప్రతిపాదనలు పంపాం..



మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా అదనపు గదులు నిర్మించేందుకు నిధుల మంజూరు కోసం జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే ఆయా పాఠశాలల్లో గదుల నిర్మాణం చేపడతాం.

– కె.శ్రీనివాసురెడ్డి, ఎంఈఓ, పెద్దకొత్తపల్లి

దరఖాస్తుల ఆహ్వానం

కొల్లాపూర్‌: ఈనెల 5వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చిన్నహుస్సేన్‌ యాదవ్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రైతు భరోసా పొందిన వారు దరఖాస్తులు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈనెల 20 చివరి గడువు ఉందని, దరఖాస్తుదారులు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు అకౌంట్‌, ఆధార్‌కార్డు జిరాక్స్‌ పత్రాలను వ్యవసాయశాఖ కార్యాలయంలో లేదా ఏఈఓలకు అందజేయాలని తెలిపారు.

కల్వకోలులో పారిశుద్ధ్య లోపం

పెద్దకొత్తపల్లి: కల్వకోలు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో మురుగు దుర్గంధం వెదజల్లి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో మురుగు నిల్వ ఉండటంతో ఈగలు, దోమల బెడద ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకొని గ్రామంలోని డ్రెయినేజీలు శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరతున్నారు.



బీఎస్పీతోనే మహనీయుల ఆశయాలు సాధ్యం

ఎర్రవల్లి: బీఎస్పీతోనే మహనీయుల ఆశయాలు సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ధర్మవరంలో బీఎస్పీ మండలాధ్యక్షుడు రాముడు ఆధ్వర్యంలో బూత్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. మహనీయుల ఆశయాలు రాజ్యాంగ పితామహుడు అంబేడ్కర్‌ ఇచ్చిన ఓటుహక్కు వల్లే సాధించవచ్చన్నారు. గ్రామాల్లో ప్రజలకు పూలే దంపతులు, మాన్యశ్రీ కాన్షీరాం చరిత్రను బోధించాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం బీఎస్పీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు. మహనీయుల చరిత్ర, సిద్ధాంతాలను ప్రజలకు చేరవేసి చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నితిన్‌, కుమార్‌, రాముడు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ రైడింగ్‌ రయ్‌.. రయ్‌..

- కిందపడితే ప్రాణాలకే ముప్పు
- పోలీసులకు దొరికితే భారీగా జరిమానా
- చిన్నపిల్లలకు బైక్‌లు ఇవ్వొద్దంటున్న పోలీసులు



కొత్తకోటలో బైక్‌ నడుపుతున్న మైనర్‌ బాలుడు



కొత్తకోటలో బైక్‌పై ముగ్గురు వెళ్తున్న దృశ్యం

కొత్తకోట రూరల్‌: పట్టణంలో స్పీడ్‌ బైక్‌లు పరుగులు పెడుతున్నాయి. యువత చేతిలో డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేకున్నా వాహనాల మీద రయ్‌.. రయ్‌ మంటూ తిరుగుతున్నారు. అంతేకాకుండా మైనర్లు, యువత ముగ్గురికి మించి బైక్‌లపై ప్రయాణిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణిస్తే అదుపుతప్పి కిందపడితే ప్రాణాలకే ప్రమాదం అని పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నా కొందరిలో మార్పు రావడం లేదు.

వేల సంఖ్యలో కేసులు..

జిల్లావ్యాప్తంగా గడిచిన ఐదు నెలల్లో ట్రిపుల్‌ రైడింగ్‌ 4,748, డ్రంకెన్‌ డ్రైవ్‌ 1,248, మైనర్‌ డ్రైవింగ్‌ 10 ఇలా వేల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. డ్రంకెన్‌ డ్రైవ్‌లో దొరికితే రూ.వెయ్యి నుంచి రూ.5వేలు వరకు లేదా ఒక రోజు నుంచి 30రోజుల వరకు జైలుశిక్ష పడే అవకాశం ఉంది. మైనర్లు డ్రైవింగ్‌లో పట్టుబడితే రూ.5వేల నుంచి రూ.10వేల వరకు జరిమానాతో పాటు బైక్‌ నడిపిన వ్యక్తితో పాటు బైక్‌ ఇచ్చిన వ్యక్తికి శిక్ష ఉంటుంది. డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేకుంటే రూ.5వేలు లేదా మూడు నెలల జైలు శిక్ష, ట్రిపుల్‌ రైడింగ్‌ దొరికితే రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు జరిమానా విధిస్తారు.

బాధ్యతగా వ్యవహరించాలి



బైక్‌పై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించే విషయంలో యువత బాధ్యతగా వ్యవహరించాలి. ముఖ్యంగా ప్రమాదాలు ట్రిపుల్‌ రైడింగ్‌, మద్యం తాగి వాహనాలు నడపడంతోనే జరుగుతున్నాయి. అలాగే డ్రైవింగ్‌లో ఫోన్‌ మాట్లాడే వారిపైన, బైక్‌ రేసింగ్‌ చేసే వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలి. లైసెన్స్‌ లేని వారికి వాహనాలు ఇచ్చే వారిపై చర్యలు తీసుకుంటే ట్రిపుల్‌ రైడింగ్‌, మైనర్లు బైక్‌ నడపడం వంటివి నివారించవచ్చు.

– భీమన్ననాయుడు, కానాయపల్లి

తనిఖీలు ముమ్మరం చేయాలి



మైనర్‌ డ్రైవింగ్‌, ట్రిపుల్‌ రైడింగ్‌, డ్రంకెన్‌ డ్రైవ్‌ వంటి వాటిని నివారించేందుకు పోలీసులు ప్రతిరోజు తనిఖీలు నిర్వహించాలి. చిన్న పిల్లలకు బైక్‌లు ఇవ్వడంతో వారు ఇష్టం వచ్చినట్టు డ్రైవింగ్‌ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మైనర్లకు బైక్‌లు ఇస్తే పోలీసులు వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచి అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

– లాల్‌కోట రవి, కొత్తకోట

దొరికితే కేసులు



ట్రిపుల్‌ రైడింగ్‌, మైనర్‌ డ్రైవింగ్‌, డ్రంకెన్‌ డ్రైవ్‌లో ఎవరూ దొరికినా వారిపై కేసులు పెట్టి భారీగా జరిమానాలు విధిస్తున్నాం. ఇలాంటి వారిని స్టేషన్‌కు పిలిపించి తల్లి దండ్రులు సమక్షంలో కౌన్సిలింగ్‌ ఇస్తున్నాం. ఇలా చేయడం వల్ల పిల్లల్లో మార్పు వస్తుంది. ట్రిపుల్‌ రైడింగ్‌ జోలికి వెళ్లరు. రెండు సార్లు ట్రిబుల్‌ రైడింగ్‌లో దొరికితే లైసెన్సు రద్దుకు సిఫారస్‌ చేయడంతో పాటు జరిమానాలు విధించి, కఠిన చర్యలు తీసుకుంటాం.

– రాంబాబు, సీఐ, కొత్తకోట